# ఒక అనుభవం

నాకు బాగాజ్ఞాపకం: చిన్నప్పుడు నాకొక స్నేహితుడుండేవాడు. వాడి పేరు మాణిక్యాలరావు. వాడి ముందు పళ్ళు పార పళ్లు! ఎత్తుగా వుండేవి క్రింద పెదవిని కరుస్తూను. విసుగొచ్చినప్పుడు వాడంటూ వుండేవాడు "నువ్వెలా పుట్టావురా?" అని. వాడి ప్రశ్నకి చివరికెవళ్లోగాని సమాధానం చెప్పారు. కాని ఇంతవరకూ "ఎందుకూ?"అన్న ప్రశ్నకి తృప్తిగా సమాధానం చెప్పేవాళ్ళెవళ్లూ దొరకడం లేదట వాడికి.

నేను చాల తక్కువగా మాట్లాడుతా నంటుంది మా ఆవిడ. మాట్లాడటం మొదలుపెడితే తక్కువగా మాట్లాడనని అంటారు స్నేహితులు.

అసలు విషయం యేమిటంటే నేను పొరుగూరు వెళ్లాలిసొచ్చింది. పదహారు మైళ్లు కాళ్లతో తొక్కేసేకాలం పోయింది. మా తోడల్లుడి కారెక్కేందుకు బుద్ధవలేదు; బావమరది లారీ ఉపయోగించేందుకు మనసుపోలేదు. రైలెక్కి వెళ్ళ బుద్ధయింది. అందుకని రైలే యెక్కాను.

ఎక్కింతర్వాత ఆ వత్తిడి చూస్తే చావబుద్ధయింది. రావలసిన స్టేషనెప్పుడు వస్తుందా అని భజన చేద్దామనుకున్నాను. ఇంతలో నా ప్రక్కనే యెవరో బొంగురు గొంతుకతో మాట్లాడారు. "ఇంతకీ ఇదంతా యెందు కొచ్చిం

దంటారు;" పాపం ప్రయాణంచేస్తూ చెయ్యలేక బాధ పడు తూన్న పెద్దమనిషి ఎవరితోనో అక్కసు కక్కుతున్నా డనుకున్నాను.

ఇంతలోనే "మిమ్మల్నేనండి?" అని భుజం తట్టాడు.

"ఏదంతా నంటున్నారండీ?" అన్నాను మర్యాదగా.

"ఆః! ఇదేనండీ యీ యుద్ధం" అన్నాడు ఆయన. అటూ ఇటూ చూచాను. ప్రక్కన ఆయన నిలబడివున్నాడు. కంటిమెడ చొక్కాతోనూ, కత్తిరించిన మీసాలతోనూ, అంటకత్తిరేసిన తలతోనూ నా సమాధానం కోసం నా గుండీలవైపు చూస్తున్నాడు. తన గుండీని బొంగరంలా త్రిప్పుతూ.

ఇంతలో ఒక లావాటిమనిషి బొంగ్రతో తలుపు తోసు కుంటూ చెమటలు కక్కుతూ కూర్చున్నవాళ్ళ కాళ్ళు త్రొక్కుతూ, నిలబడ్డవాళ్ళని నెట్టుకుంటూ, హోల్డాల్ నిలు వునా సీపువెనుక పెట్టుకుని, పొట్టబలంతో పెట్టెలోకొచ్చాడు. ఇంతమనిషి నాలా నిలువుజీతం ఎందుకు పుచ్చుకుంటాడు అను కున్నా, ఎట్లా పుచ్చుకుంటాడో అనుకున్నా.

"మాట్లాడరేమండీ" అన్నాడు కంటిమెడ మనిషి. లావాంటి మనిషివచ్చి నా మీద నిలబడినట్టే నిలబడ్డాడు నా ప్రక్కన.

"ఏమో నాకు తెలియదండీ" అన్నా నేను నిజంచెప్పే ముఖంపెట్టి. ఆయన కా సమాధానం సరిపడ్డట్టు లేదు.

కొంచెం విసుగుగూడా కలిగిందేమో ననిపించింది. ఆయన నోటికి పెట్టిన వంకరచూస్తే నా ప్రక్కన నిలబడ్డ లావాటి మనిషి రొప్పుతున్నాడు. ఆవులించి ఒక చిటికెవేశాడు. చిటికె వేశాడేకాని చిటికవేసే చేయి హోల్డాల్నొదిల్తేగాని చిటికె వేయలేనని, హోల్డాల్నొదిల్తే అది మా అందరి వెనకా కూర్చున్న పెద్దమనుష్యులమీద పడవలసి వస్తుందనీ ఆయన ఆలోచించి వుండడు. ఇదంతా ఆలోచిస్తే ఆయన ఆ చిటికె యెందుకేస్తాడు? అని ఆలోచించుదా మనుకున్నాను. ఈ విషయం ఆలోచించబోయి కంటిమెడ మనిషిని మరచిపోయాను. ఆయన మాత్రం నా విషయం మరచిపోలేదు.

"తెలియక పోవటమేమిటండీ?" అని మందలించాడు నన్ను. అప్పుడనుకున్నాను ఆయన్ని నేను మరచిపోయాననీ, నన్నాయన మరచిపోలేదని.

"నేను ప్రెసిడెంటును కాదు, జనరల్ని కాదు. ఎడ్మి 'రల్ని కాదు. ఎయిర్ మార్షల్ని కాదు. నేను యుద్ధం చేసే మనిషిని కాదు. నా కెల్లా తెలుస్తుంది?" అని నేనే ఆయన్నెదురడిగాను. అడిగానుకదా అని తృప్తిపడ్డాను.

"ఏమండోయ్ మీ హోల్డాలు మా మోకాళ్ళమీద పడుతుంది. మా పసిపిల్లల్నెక్కడ కూర్చోబెట్టుకోం" అన్నారు కూర్చున్నవాళ్ళల్లో ఒకళ్ళు లావాటి మనిషితో.

"ఇంకా నయం! నేను కూర్చోలేదని సంతోషించక" అని ఎక్కెక్కి నవ్వాడు లావాటి పెద్దమనిషి.

"పాపం! తల్లి రొమ్ము వదలని కుఱ్ఱాడండీ, నిలబడితే పెద్దవాళ్ళ కాళ్ళక్రింద నలిగిపోతాడండీ; కాస్త ఆ హోల్డాలు తెద్దురూ" అన్నారు ఎవరో దగ్గరగా కూర్చున్నవాళ్ళు.

లావాటాయన భుజాలెగరేశాడు. ఆయన యెగరేసిన భుజాలు నా డొక్కల్లో వత్తుకున్నాయి. "ఇదుగో చూడండీ!" అన్నాను. ఆయన నా మాట వినిపించుకున్నాడో లేదో తెలియదు.

"నేను మాత్రం టిక్కట్టు కొనలేదంటావా" అన్నాడు. ఇంతవరకూ నన్నెరగనివాళ్ళెవళ్లూ నన్ను యేకవచనంతో సంబోధించలేదు. ఆయన నా మాట వినలేదని రూఢి చేసుకున్నా ఆయన మాట్లాడిన వాలకం చూచి.

"అయితే మీకీ యుద్ధంసంగతి పట్టదంటారు?" అన్నాడు కత్తిరించిన మీసాల మనిషి బెదిరిస్తూన్నట్లు. నా తలనిండా చెమట పుట్టి దురద పట్టింది. గోక్కుందామని చెయ్యి లేపబోయాను. లావాటి మనిషి పొట్ట అడ్డం వచ్చింది. లావాటి మనిషి మాట్లాడుతున్నాడు. లేకపోతే ఆయన పొట్ట అట్లా కదలదు.

"ఆఁ! చాలామందిని చూచాం నీ లాంటివాళ్ళని. వెనక్కి యెనళ్లో అన్నారులే దేనికో లేని దురద దీనికెందుకని. నా హోల్డాలాయనమీద పడిందా నీమీద పడిందా. ఆ అబ్బాయి వాళ్ళబ్బాయా, నీ అబ్బాయా చెప్పు చూద్దాం" అన్నాడు. అని సవ్వాడనుకుంటాను; లేకపోతే ఎవళ్ళన్నా గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నారేమో కూర్చున్నట్టే కూర్చుని.

"మాట్లాడరేమండీ! ఈ యుద్ధంతో సంబంధమే లేదం టారా మాకు" అన్నాడు కత్తిరించిన మీసాల మనిషి. చెప్పొద్దూ, ఆయన కవ్వించుతున్నా డనిపించింది నాకు.

"మా వూరు చెరువుగట్టు తుమ్మచెట్లలోనుంచీ, మా దేవుడి గుడి గర్భగుడిలో నుంచీ, పొట్లచెట్లు పందిరిలోంచీ, గొడ్లచావిడిలోంచీ, గడ్డివాము వెనుకనుంచీ రోజూ చీకటి కొట్టవచ్చినట్లొస్తుంది మా వాకిట్లోకి. నేనెప్పుడూ యెవర్నీ అడగలేదు ఎందుకొస్తుందని?" అన్నాను నేను. అని వూరుకో లేదు. "ఇందాక నేనేమేమి కాదో చెప్పాను. ఏమి ఔనో ఇప్పుడు చెబుతున్నా విను మహాశయా!" అన్నాను. చేప్పే వాడినే కూడాను. కాని ఆయన వినదలచుకోలేదు; ఆయన వినదలుచుకున్నా, లావాటి మనిషి ఆయన్ని విననిచ్చేట్లు కన్పించలేదు. "ఆయనకేమయ్యా? ఏమన్నా అంటాను. బొత్తిగా మర్యాద లేకపోతే యెట్లా? అంటానా, అని చూపి స్తానా? అమ్మకి, అయ్యకి పుట్టిన మనిషైతే ఎవళ్ళ గొడవో నాకెందుకని వూరుకుంటాడు. మళ్ళీ మళ్ళీ మాట్లాడితే నా హోల్డాలుకాదూ; నేనొచ్చి కూర్చుంటా. కూర్చున్నతర్వాత చూస్తా ఆపే గాడిదకొడుకెవ్వడో" అన్నాడు ఆ లావాంటి మనిషి.

కత్తిరించిన మీసాల మనిషి కోపంతో ననుకుంటా మునిమీసాలు మునిపళ్ళతో కొరుక్కున్నాడు. లావాంటి మని షితో పోట్లాడతాడనుకున్నాను. ఆయన నా విషయం మరిచి పోయాడు కదా అనుకుని బుష్‌షర్టు గుండీ వదులుచేసి కాలరు వెనక్కు లాక్కున్నాను గాలికోసం.

"చాలా తెలివిగా సమాధానం చెప్పావనుకుంటున్నారల్లే వుందే మీరు?" అన్నాడు నా కళ్ళల్లోకిచూస్తూ. అట్లా అంటూంటే మీరు నమ్మతారో లేదో ఆయన కళ్ళు చికిలించినట్లు కుంచించుకున్నయి. కోపం ఈయనక్కూడా ఎక్కుతుందేమోనని భయపడ్డాన్నేను.

"అది కాదండీ! వున్నమాట చెప్పాను; ఇందులో తెలివితేటల సందర్భం ఏముంది? నిజంగానే నాకేమీ తెలియదండీ యీ యుద్ధాన్ని గురించి, మరి మీకేమైనా తెలుసేమో?" అన్నాను నవుస్తూనే.

"ఏమండోయ్! ఈ హెకిలీ, యెద్దావా ఎందుకు పనికి రావండోయ్" అన్నాడాయన. ఆయన కోపంతో అంటున్నాడో, పిల్లవాడిని మందలించినట్లు మందలిస్తున్నాడో అర్థం కాలేదు నాకు, మాట్లాడేప్పుడు తొంగిచూచిన ఆయన పలువరస చూస్తే.

"ఈ యెద్దావా ఎందుకూ పనికిరావండోయ్" అని "మీరు చాలా గొప్పవారిలాగా వున్నారే!" అన్నాడు. ఈసారి సందేహం తీరింది నాకు.

"ఆ సంగతి నేనెలా అంటాను కానండీ. ఈ ప్రపంచంలో నాకంటే ఘనమైన మనిషి నాకు కన్పించడు. నేను చేసే పనులకంటే ఇష్టమైన పనులు కన్పించవు నాకు. నాకు నేనే ముద్దుబిడ్డని. సరే కానండీ. నాకేమీ తెలియదనంటే మీకంత కోపమెందుకండీ" అని అర్థించబోయాను.

ఇంతలో మళ్ళీ లావాంటి మనిషి మాటలు ప్రతిధ్వనించాయి. "ఈ జిల్లాలో నా సొమ్ము తినని ముండాకొడుకెవడయ్యా. ఇంతమందికి పెట్టగా లేంది రైలు పెట్లో ఇంత జాగా దొరకదూ! చూస్తాగా ఎవడి తాత తాత అడ్డం వస్తాడో! జరగవయ్యా. జరగమంటే జరగవేం పెద్దమనిషిలాగా" అన్నాడు. అని ప్రక్కనున్న మనిషిని తొయ్యాలనే అనుకుంటూ వంగాడు. ఇంతలోనే ఏమిటో సర్రుమన్నది. పెట్టె అంతా పకాలుమన్నది. ప్రక్కకి తిరిగి చూస్తే పాపం ఆయన లాల్చీలోంచి కబంధుడి కన్నులాగా చూస్తోంది ఆయన వీపు. కత్తిరించిన మీసాల మనిషికి ఇదంతా యేమీ పట్టినట్లు లేదు. పట్టితే నాతో—

"అది కాదండీ; ఇది యిదీ అని సిద్ధాంతం చెయ్యొచ్చును కదా అని" అని ఎందుకంటాడు?

"నాకు తెలియని విషయాన్ని గురించి నే నెందుకండీ రాద్ధాంతం చెయ్యడం" అన్నాను.

"సిద్ధాంతం అంటే రాద్ధాంతం అని మీ అభిప్రాయం అనుకుంటా" అన్నాడు ఆయన అంటకత్తిరేసిన తల నిమురుకుంటూ.

"అది కాదు!" అన్నా నేను.

"అంతేలే మీరనుకునేది!" అన్నాడు ఆయన.

"నేననుకునేది నాకు తెలియదంటూరా?" అన్నా నేను విస్తుపోతూ.

"ఆపవయ్య వెధవ గొడవ!" అంటున్నాడు లావాటి మనిషి.

"నేననుకునేది నాకు తెలియదనీ, మీకు తెలుసుననీ అంటున్నారన్నమాట!" అన్నాన్నేను నాకు తెలియకుండానే మళ్ళీ. అట్లా అంటూంటే లావాంటి మనిషి నామీద పడుతూన్నట్లు నా కనుమానం కలిగింది.

"నోరు ముయ్యవయ్యా అంటే" అన్నాడు ఆ లావాంటి మనిషి నాతో నే.

నేను రైటెబొట్టర్నయ్యాను.

"ఏం! మీకేం విన సొంపుగా లేదా?" అన్నాను లావాంటి మనిషితో నే.

"చాల్లే! ఆపు ఆ కయిత్తం" అన్నాడు దవడలు సాచి, "విన సొంపుగా లేని మాట వాస్తవమే!" అన్నాడు మళ్ళీ సాచిన దవడలు చాస్తూ.

"అయితే దయ చెయ్యండి!" అన్నాను నాకూ మంటెత్తింది.

"ఎందుకు దయ చెయ్యాలి? నీకోసమా? బలే బుల్లాడివే!" అన్నాడు వెక్కిరిస్తూనూ.

"అది కాదు బొజ్జబాబూ! తమరి ఆనందంకోసమే!" నేను.

"ఛ! ఛండాలుడు..." అన్నాడు; ఇంకా అన్నాడు; చెప్పకుంటే సిగ్గుచేటు కాని.

"మీరేమీ గౌరవంగా మాట్లాడడంలేదు" అన్నాను యింకేం అనాలో అప్పట్లో తోచక.

"నోరు మూస్తావా? నెట్టనా" అన్నాడు. అని పై పైకొచ్చాడు ఆ లావాంటి మనిషి.

కూర్చున్నవాళ్ళు లేచి లావాంటిమనిషిని పట్టుకున్నారు. పట్టుకుని "మేం పెట్టిన గడ్డీ, నేర్పిన పాఠమూ యింకా అరగలేదంటయ్యా!' అన్నారు. అని మూలకితోసి చోటులేనిచోట నొక్కారు. నేను చెమటలు తుడుచుకుంటూ, గాలికోసం తహతహలాడుతూ అటూ ఇటూ చూచాను. నా ప్రక్కన ఆ మనిషి నిటారుగా నిలబడి ఆ కంటిమెడతోనూ, కత్తిరించిన మీసాలతోనూ ,అంట కత్తిరేసిన తలతోనూ చిరునవ్వు నవ్వుతున్నాడు. నాకు కోపం వచ్చింది. కొద్దిగా సిగ్గేసింది కూడాను. అప్పుడు నాకు తోడుకోడలు నవ్వు సంగతి గుర్తుకు రాలేదు. ఏం చేసేవాడినో యిప్పటికి తెలియటంలేదు. నా అదృష్టం బావుండి నేను దిగవలసిన స్టేషన్లో రైలు రఫీమని ఆగింది. జనాన్ని తోసుకుంటూ ప్లాట్ఫారంమీద పడ్డాను. మోకాళ్ళ చిప్పలు నెత్తురు చిమిరాయి. అయినా ఆగకుండా టికెట్ కలెక్టర్ కి టిక్కెట్టిచ్చి, జట్కాయెక్కి వెళ్ళదలచుకున్న యింటిముందు దిగి, జట్కావాడికి డబ్బులిచ్చి వాడిని చిల్లరడక్కుండా, మేడమెట్లెక్కి, యింట్లోకెళ్ళి కనపడని ఆడవాళ్ళని దాచే తలుపుల్తో "మంచినీళ్ళు యిస్తారాండీ!" అని గడపబయట గ్లాసు పెట్టిన చేతిని చూడకుండా, గ్లాసులోవున్న మంచినీళ్ళు త్రాగి, కుర్చీ లాక్కొని, కుర్చీలో శరీరాన్ని చేరవేసి, కాళ్ళు గుంజుకుని, కళ్ళు మూసుకుని, నెత్తిమీద

చేతులు పెట్టుకుని అంట కత్తిరేసుకున్న తల అడిగిన ప్రశ్న గుర్తుకు తెచ్చుకున్నాను. "ఇంతకీ ఇదంతా యెందుకొచ్చిందంటారు?"

ఆ ప్రశ్నే తర్వాత చాలమందిని అడిగాను, సంగతి సందర్భాలన్నీ చెప్పి.

కొంతమంది నా చిన్నప్పటి స్నేహితుడు మాణిక్యాల రావు వేసిన ప్రశ్న వేస్తారు నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా.

మా రాణి "మీరింత గొప్పగా మాట్లాడతారని నాకిదివరకే తెలుసును సుమండీ. నేను పిచ్చిదాన్ని కాదండోయ్, మీరు పిచ్చివారను కునేందుకు!" అంటూ నా కళ్ళలోకి చిలిపిగా, వేడిగా, సూటిగా చూస్తుంది; చూచి గిలిగింతలు పెడుతుంది.

స్నేహితులు "మేం అనలేదురా మాటాడటం మొదలు పెట్టాలేగాని నువ్వు తక్కువగా మాట్లాడవని" అని అంటారు.

చివరికి ఎవరూ సమాధానం చెప్పరు; ఎవరూ చెప్పలేదని చెప్పేందుకు నాకు సాహసం లేదు !!

— ॥ —